దోమల నివారణకు పటిష్ట చర్యలు

సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాత

కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సరూర్‌నగర్ ఉప కమిషనర్ సుజాత

ఎల్బీనగర్, జూలై 11 : దోమల నివారణ, దోమల నుంచి వ్యాపించే వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జీహెచ్ ఎంసీ, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు గురువారం కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. సరూర్ నగర్ సర్కిల్ ఉప కమిషనర్ సుజాత ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను వివరించడంతో పాటుగా దోమలను దరిచేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సదస్సులో వివరించారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలకు ఆవాసాలు లేకుండా పోతాయని వివరించారు. ప్రధానంగా పాఠశాల తరగతి గదులు, ఆవరణతో పాటుగా తమ నివాసాలను కూడా అపరిశుభ్రతకు తావు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమ కాటుతో వచ్చే వ్యాధుల్లో డెంగ్యూ ప్రమాదకరంగా మారుతుందని, ఈ వ్యాధితో ప్రాణాలు సైతం పోయే ప్రమాదం ఉన్నందున ఈ వ్యాధి రాకుండా ముందస్తుగానే సిద్ధం కావాలన్నారు. దోమకాటుకు గురికాకుండా ఉండాలంటే ముందుగా దోమల నివారణకు గల మార్గాలను అన్వేషించి అందుకు శ్రీకారం చుట్టాలన్నారు. దోమల నివారణలో విద్యార్థులు కీలకపాత్ర వహించాలని, తమ నివాసాల్లో తల్లిదండ్రులను కూడా అప్రమత్తం చేసి దోమలను దరి చేయకుండా చేయడం ద్వారా దోమ కాటు నుండి రక్షణ పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ నీలిమ, డాక్టర్ , హెడ్మాస్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏరియా దవాఖాన సమస్యలు పరిష్కరించాలి

సైదాబాద్, జూలై 11 : మలక్‌పేట ఏరియా దవాఖానలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల కోరారు. ఈ మేరకు గురువారం ఆయన.. రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మలక్‌పేట ఏరియా దవాఖానలో ఏర్పడ్డ వైద్యుల, సిబ్బంది ఖాళీలను తక్షణమే పూర్తి చేయాలని, అదే విధంగా అనేక బస్తీ దవాఖానల్లో కూడా మెడికల్ ఆఫీసర్లు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సిబ్బంది కొరత ఉందని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానల్లో మెడిసిన్, పరికరాలు, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో అత్యాధునిక వైద్య సేవలను అందించేందుకు అవసరమైన వైద్యసిబ్బంది, పరికరాలను నెలకొల్పి దవాఖానలను అభివృద్ధి చేయాలన్నారు. వ్యాధులను దృష్టిలో పెట్టుకొని పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

ప్రత్యేక పూజలు

మన్సూరాబాద్, జూలై 11: ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి శుక్రవారం నాగోల్ డివిజన్, శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి దేవాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేశ్‌యాదవ్ తెలిపారు. మొదటి శుక్రవారం ననింబశాఖ మాల అలంకరణ , 19న శాకాంబరి దేవి అలంకరణ , 26న జంబిర ఫల మాల అలంకరణ , ఆగస్టు 2న హరిద్రకాండమాల అలంకరణచేసి పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా కొనసాగుతున్న చల్లా నర్సింహారెడ్డి అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పూలబొకె అందజేసి సత్కరించారు. పదవి అప్పగించడం పట్ల తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు.
– బడంగ్‌పేట, జూలై 11

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జ్యోతి పాండు

కందుకూరు, జూలై 11 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి కోరారు. మండల మాజీ ఎంపీపీ మంద జ్యోతి పాండు గురువారం ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నట్లు తెలిపారు. ప్రజలకు బీజేపీ ప్రభుత్వం రుణపడి ఉంటుందని తెలిపారు. ఇచ్చిన మాటను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. పార్టీ పథకాలను ప్ర జల వద్దకు తీసుకువెళ్లాలని కోరారు. దేశంలో , రాష్ట్రంలో పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తిం పు ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

ఉప్పల్ మండల విద్యాశాఖ అధికారి శశిధర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంపత్, తదితరులు

మన్సూరాబాద్, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ గురువారం ఉప్పల్ మండల విద్యాశాఖ అధికారి శశిధర్‌కు ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల నియామకానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల కోసం విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను యాజమాన్యాలు వేధిస్తున్నాయని తెలిపారు. టీసీ, బోనాఫైడ్ సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల ఎదురుగా అర్ధనగ్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఫీజుల దోపిడీని అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ అధ్యక్షుడు ఉపేందర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీధులు పరిశుభ్రంగా ఉండాలి

చంపాపేట, జూలై 11: బోనాల ఉత్సవాల్లో డివిజన్ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వీధులన్నీ పరిశుభ్రంగా ఉండాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జీహెచ్ ఎంసీ ఎల్బీనగర్ సర్కిల్ 4 ఉపకమిషనర్ జాకియా సుల్తానా, శానిటరీ విభాగం డీఈ వెంకటేశంతో కలిసి ఆయన డివిజన్ పరిధిలోని అల్తాఫ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వీధుల్లోని కొన్నిచోట్ల ఉన్న మట్టిదిబ్బెలు, చెత్తను శానిటరీ కార్మికులతో తొలగించారు. ఈ సంద ర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ...ఆషాఢ మాసంలో గ్రామ దేవతలైన అమ్మవార్లకు ప్రజలు బోనాలు సమర్పించుకునేందుకు ఊరేగింపుగా తరలి వస్తుంటారు, అందుకు వీధులు అపరిశుభ్రంగా ఉండేలా చూడాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు.


సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఎల్ఓసీని బాధితురాలి భర్త ఇమ్మిడి యాదయ్యకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్

చంపాపేట, జూలై 11 : అనారోగ్యానికి గురయ్యే పేదలు వైద్యం చేయించుకునేందుకు భారీ మొత్తంలో అయ్యే ఖర్చులకు భయపడొద్దని భరోసానిచ్చేదే ముఖ్యమంత్రి సహాయనిధని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధి బైరమాల్‌గూడకు చెందిన ఇమ్మిడి ప్రమీలకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.100,000 ఎల్ఓసీ చెక్కును గురువారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యానికి గురయ్యే పేదల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ భరోసాను కల్పిస్తుం దన్నారు. ఈ పథకం పేదలకు ఓ వరంలాంటిదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు చీర శ్రీనివాస్, బాధితురాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

జోనల్ కమిషనర్‌కు సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్ ఆకుల

ఆర్కేపురం, జూలై 11 : సరూర్‌నగర్ డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ అధికారులను కోరారు. గురువారం జోనల్ కమిషనర్ హేమంత్ పాటిల్, సరూర్‌నగర్ సర్కిల్ డీసీ సుజాత, శానిటైజేషన్ డిపార్ట్‌మెంట్ డీఈ నీలిమతో కలిసి కార్పొరేటర్.. జేబీ కాలనీ వర్షపు నీటి నాలా, విజయపురి కాలనీ నాలా, పోచమ్మ బాగ్ ప్రభుత్వ పాఠశాలల వద్ద రోడ్డు, భగత్ సింగ్‌నగర్‌లో జీడీ పాయింట్ పరిస్థితిని పరిశీలించారు. సత్వర ప్రత్యామ్నాయ పరిష్కారాన్ని అందించడానికి అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేయడం జరిగిందన్నారు. కాలనీల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కరించి సమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరినట్లు కార్పొరేటర్ శ్రీవాణి తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

వనస్థలిపురం, జూలై 7 : నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ అన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని పలు కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ..వర్షాల నేపథ్యంలో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. నాణ్యతా లోపాలు ఉంటే సహించేది లేదన్నారు. చెత్త నిర్వహణలో సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఈ హేము నాయక్, గంధం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అనాథ విద్యార్థులకు రూ.1.25 లక్షల స్కాలర్‌షిప్‌లు

విద్యార్థులకు రూ.1లక్ష 25వేల క్యాష్ అవార్డు ఆర్డర్స్‌ను అందజేస్తున్న ప్రియాంక సింగ్

ఆర్కేపురం, జూలై 11 : తెలంగాణ రాష్ట్రంలో చైల్డ్ కేర్ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థుల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఐదుగురు అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు బెంగళూరుకు చెందిన గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్ సంస్థ నుండి ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మొత్తం రూ.1 లక్ష 25వేలను అవార్డుగా అందజేశారు. గార్డియన్స్ ఆఫ్ డ్రీమ్స్ సంస్థకు చెందిన ప్రోగ్రామ్ లీడర్ (హైదరాబాద్, కలకత్తా, బాంబే) మిస్ ప్రియాంక సింగ్ ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహాన్ని సందర్శించి.. స్కాలర్‌షిప్ అవార్డులను 5 గురు విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో ఎస్.శివ 97శాతం, పి.వంశీ 84శాతం, పి.సాయికిరణ్ 83శాతం, ఎస్ఎస్‌సీలో జి.కార్తిక్ 95శాతం, డి.గణేశ్ 87శాతం పొందిన విద్యార్థులకు క్యాష్ అవార్డు ఆర్డర్స్‌ను గృహ అధ్యక్షుడు రాజేశ్ సమక్షంలో అందజేశారు.

ఆర్కేపురం డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్కేపురం, జూలై 11 : ఆర్కేపురం డివిజన్‌లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని శ్రీరామ కృష్ణాపురం, హరిపురి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీల్లోని సమస్యలను లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. కాలనీల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి, పున్న గణేశ్, బండి మధుసూదన్, సురేంద్ర కుమార్, జ్ఞానేశ్వర్‌యాదవ్, సైదులు, మహేందర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు

కందుకూరు, జులై 11 : వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారికి గాయాలయ్యాయి. మండల కేంద్రంలో నివాసం ఉండే ఆరేళ్ల సాయి భార్గవి గురువారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా ఒక్కసారిగా కుక్కలు దాడి చేయడంతో గాయాలు అయ్యాయి. చిన్నారి అరుపులను చూసి స్థానికులు స్పందించి రక్షించారు. దీంతో చిన్నారికి ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనను చూసిన స్థానికులు కుక్కల దాడిని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లలను బైటకు పంపియ్యాలన్నా భయపడుతున్నారు.అధికారులు స్పందించి కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నారు.

చైన్‌స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్

మన్సూరాబాద్, జూలై 11: చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ సుధీర్‌క్రిష్ణ కథనం ప్రకారం.. రాజస్థాన్, జట్వార హిందౌన్, నహరియాకపూర్ గ్రామానికి చెందిన గులాబ్‌సింగ్ గుర్జార్, భరత్‌పూర్ బయానాకు చెందిన అమేత్ గుజ్జర్ గార్నెట్ వర్కర్లు. గులాబ్‌సింగ్ గుర్జార్ పాత నేరస్తుడు. ఎల్బీనగర్, జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నాలుగు కేసుల్లో నిందితుడు. గులాబ్‌సింగ్ గుర్జార్, అమేత్ గుజ్జర్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన ఈ ఇద్దరు దొంగతనాలు చేయడం ఆరంభించారు. తరచూ రాజస్థాన్ నుంచి నగరానికి వచ్చి దొంగతనాలకు పాల్పడి తిరిగి వెళ్తుంటారు. నగర శివారు ప్రాంతాల్లో బైకుపై తిరుగుతూ ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడ లోని బంగారు ఆభరణాలను దోచుకుంటారు. నాగోల్, లక్ష్మీనర్సింహా కాలనీకి చెందిన సుక్కమ్మ రోడ్డుపై వెళ్తుండగా బైక్ పై వచ్చి ఇద్దరు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. బండ్లగూడ చౌరస్తాలో గురువారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు బైకుపై వచ్చిన గులాబ్‌సింగ్ గుర్జార్, అమేత్ గుజ్జర్ ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించగా అదుపుకుని తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు.

బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలి

కందుకూరు, జూలై 11 : బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. పార్టీ సీనియర్ నాయకులు సామ మహేందర్‌రెడ్డితో పాటు కడ్తాల్ మండలం రావిచేడ్ మాజీ ఎంపీటీసీ గోపాల్‌లు గురువారం ఆమెను కలిశారు. ఆమె మాట్లాడుతూ, పార్టీలో ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని పేర్కొనారు. పార్టీకి మళ్లీ మంచి రోజులు వస్తాయని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మండలంలో పర్యటన ....

ఈ నెల 12న మండలంలో పర్యటిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఉదయం 10గంటలకు మండల పరిధిలోని నెదునూరు గ్రామంలో అమెజాన్ కంపెనీ సహకారంతో నిర్మించి న అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించిన అనంతరం కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న మహోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం కొత్తూరు గ్రామంలో అమెజాన్ కంపెనీ సహకారంతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. సబితా ఇంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.

కాలనీల మధ్య సెల్‌టవర్ వద్దు

బడంగ్‌పేట,జూలై11 : బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ ప్రైమ్ పర్ ట్యూన్ కాలనీ మధ్యన సెల్‌టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని కాలనీ అసోసియేషన్ నాయకులు బడంగ్‌పేట కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీ మధ్యన చిన్న స్థలంలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సమస్యలు ఉత్పన్నం అయ్యే అవకాశాలున్నాయని కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నానవత్ జ్యోతి జేపాల్ నాయక్ కమిషనర్‌కు వివరించారు.

కేంద్ర ప్రభుత్వ కొత్త చట్టాలపై ఆటో డ్రైవర్ల నిరసన

ఎల్బీనగర్, జూలై 11: కేంద్ర ప్రభుత్వ నూతన చట్టాలకు నిరసనగా సరూర్‌నగర్ సర్కిల్ ఆటో కార్మికుల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ సర్కిల్ పాత కోర్టు, సరూర్‌నగర్‌చౌరస్తా, ఆటో స్టాండ్ ప్రాంతాల్లో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు కడారి రాములు, సరూర్‌నగర్ సీఐటీయూ సర్కిల్ మల్లెపాక వీరయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ.. నూతన చట్టాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నామన్నారు. నూతన చట్టాల ఆధారంగా అమాయక ప్రజలు, ఆటో డ్రైవర్లు శిక్షకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. తెలంగాణలో ఉచిత బస్సు సౌకర్యం నేపథ్యంలో ఆటో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నంగా మారాయని, వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఆటో కార్మికులను రూ. 12 వేలను అందించాలన్నారు. ఆటో కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి ప్రతి కార్మికుడికి రూ.10 లక్షల ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ రాములు, పలువురు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వ్యాధులు సోకకుండా అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, జూలై 11 : వ్యాధులు వ్యాపించకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి బానోతు సీత తెలిపారు. గురువారం మండల పరిషత్ హాల్‌లో మండల వైద్యాధికారులు సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, పంచాయతీల కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దోమల నివారణకు ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. సాధారణ జ్వరాలను కూడా డెంగ్యూ వ్యాధిగా పేర్కొంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వివరించారు. ప్రజల్లో ఉన్న అనుమానాలను పోగొట్టాలని చెప్పారు. తొలకరి వర్షాలు కురుస్తున్నందున నీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అందుకోసం పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు సంధ్యారాణి, హరినాథ్, సీఎచ్ఓరవీందర్ పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి పోస్ట్‌బాక్స్ అనే నినాదాన్ని చట్టసభల్లో ప్రస్తావిస్తాం..

ఎంపీ ఈటల రాజేందర్‌ను సన్మానిస్తున్న స్థానిక ఉత్పత్తుల కేంద్రం ఎల్పీడీఓ అధ్యక్షుడు భరత్

చంపాపేట, జూలై 11: ప్రతి ఇంటికి పోస్ట్‌బాక్స్ అనే నినాదాన్ని చట్టసభల్లో ప్రస్తావిస్తామని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఉత్పత్తుల కేంద్రం ఎల్పీడీఓ అధ్యక్షుడు భరత్ సంఘం ఆధ్వర్యంలో గురువారం వారిని కలిశారు. ఈ సందర్భంగా వారు ఇరువురు ప్రజా ప్రతినిధులు స్థానిక ఉత్పత్తుల కేంద్రం ఎల్పీడీఓ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రతి ఇంటికి పోస్ట్‌బాక్స్ నినాదాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ...ఈ విషయాన్ని చట్టసభల్లో ప్రస్తావించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలిపినట్లు వివరించారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఇరువురి ప్రజా ప్రతినిధులను వేరు, వేరుగా సన్మానించినట్లు పేర్కొన్నారు.

అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం

కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి

మలక్‌పేట, జూలై 11: మూసారాంబాగ్ డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నామని, వాటి నిర్మాణాలకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధంచేసి ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందని కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి తెలిపారు. డివిజన్ పరిధిలోని రామాలయం బస్తీలో రూ.4 లక్షల వ్యయంతో, గడ్డి అన్నారం బస్తీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో రోడ్ల నిర్మాణపనులను ఆలస్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. బీటీ రోడ్లు త్వరగా చెడిపోతున్నందున ఎక్కువ కాలం మన్నిక వచ్చే సీసీ రోడ్ల నిర్మాణాలకే ప్రాధాన్యతనిస్తున్నానని తెలిపారు. అనంతరం ఆలయాల పరిసరాల్లో వ్యర్థాలు, చెత్త, చెదారం తొలగింపు పనులను శానిటేషన్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురవకుండా అన్నిసమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం ఏఈ రవికాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, శానిటేషన్ జవాన్ రమేశ్, సూపర్‌వైజర్లు గణేశ్, ముజీబ్, సుభాష్, శ్రీనివాస్, బీజేపీ నాయకులు సామ మల్లారెడ్డి, యాదగిరి సురేందర్, ప్రభాకర్, అమిత్, జీవన్, కిరణ్, ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వైఖరికి నిరసనగా..న్యాయవాదుల విధుల బహిష్కరణ


న్యాయవాది రవికుమార్‌పై పోలీసుల దాడిని నిరసిస్తూ నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూలై11(నమస్తే తెలంగాణ)/ఆర్కేపురం: న్యాయవాదిపై దాడికి పాల్పడి అక్రమ కేసు బనాయించిన సిద్దిపేట పోలీసుల వైఖరికి నిరసనగా తెలంగాణ న్యాయవాద ఫెడరేషన్ పిలుపు మేరకు గురువారం రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. ఫెడరేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి ఆధ్వర్యంలో కోర్టుల ముందు జాతీయ రహదారిపై పెద్దఎత్తున న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. దీంతో రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఈ సంద